వరంగల్ కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి ఉద్యోగాల పేరుతో మోసం

ప్రధాన నిందితుడు మున్సిపల్ ఉద్యోగి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న హనుమకొండ ఏసీపీ నరసింహారావు

సుబేదారి, మే 26 : వరంగల్ కలెక్టరేట్ ఆఫీస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని వరంగల్ కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసాలకు పాల్పడిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఉద్యోగిని సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం సు బేదారి పోలీసు స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ నరసింహారావు నిందితుడి అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం వరంగల్ నగరం రామన్నపేటకు చెందిన మంద కల్యాణ్ తండ్రి గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ జవాన్‌గా పనిచేస్తూ 2019లో గుండెపోటుతో చనిపోయాడు. దీంతో కల్యాణ్ తండ్రి జాబ్‌లో చేరాడు. అనంతరం జల్సాలకు అలవాటు పడి 2024 ఫిబ్రవరిలో జాబ్ మానేశాడు. వరంగల్ కలెక్టరేట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని కల్యాణ్ తన స్నేహితులు కూరపాటి భవ్యకిరణ్, మంద వంశీతో కలిసి 40 మంది నిరుద్యోగుల వద్ద రూ.16.40లక్షలు వసూలు చేశాడు. వరంగల్ కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, నకిలీ నియామక పత్రాలు, సర్వీస్ బుక్‌లను తయారు చేసి మోసాలకు పాల్పడ్డాడు. పక్కా సమాచారంతో సోమవారం అదాలత్ సెంటర్‌లో వాహనాలు తనిఖీలు చేస్తూ నిందితుడు కల్యాణ్‌ను పట్టుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. నిందితుడి నుంచి కారు, బైక్, ఎల్ఈడీ టీవీ, 39 నకిలీ సర్వీస్ బుక్‌లు, ఉద్యోగ నియామక పత్రాలు, రబ్బర్ స్టాంపు, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మడికొండలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మడికొండ, మే 26 : నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. గ్రేటర్ 64వ డివిజన్ మడికొండలోని వెస్ట్ సిటీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, గ్రేటర్ 45వ డివిజన్‌లోని కడిపికొండ మసీదు వద్ద రూ.20లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశల వారీగా కాలనీలను అభివృద్ధి చేస్తూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. 64వ డివిజన్ పరిధిలో ఇప్పటికే సుమారు రూ.3.5 కోట్లతో పనులు చేపట్టామని, మరో రూ.1.4 కోట్లతో పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107కి కాల్ చేయాలని కోరారు. కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, జలగం అనిత, మెట్టుగుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండలాధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుర్ల మోహన్, తొట్ల రాజు, సట్ల సదానందం, వెంకటరమణ, కర్ర హరీశ్‌రెడ్డి, కట్కూరి రేవంత్, బస్కె ప్రణయ్ పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతదేహాలను బంధువులకు అప్పగించాలి

హనుమకొండ, మే 26 : ఈ నెల 21వ తేదీన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను వెంటనే బంధువులకు అప్పగించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రం భుజంగరావు, ఎస్ తిరుపతయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవ రావుతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన సజ్జ వెంకట నాగేశ్వరరావు (రాజన్న), వన్నాడ విజయలక్ష్మి (భూమిక), గోనెగండ్ల లలిత (సంగీత), బుర్ర రాకేశ్ (వివేక్)లు ఉన్నారని, వీరి మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు గురువారం ఛత్తీస్‌గఢ్ వెళ్లి నారాయణపుర్ జిల్లా పోలీస్ స్టేషన్, ఆస్పత్రుల ఎదుట ఐదు రోజులుగా పడిగాపులు కాస్తున్నారని, అన్ని పత్రాలు సమర్పించినా మృతదేహాలను అప్పగించలేదని పేర్కొన్నారు. మృతదేహాలను కోల్డ్ స్టోరేజ్‌లో కాకుండా మార్చురీలో ఓపెన్‌గా పడవేసి ఉంచారని తెలిసిందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగి ఆరు రోజులు అవుతున్నా మృతదేహాలను అప్పగించ లేదన్నారు. మృతదేహాలకు అంత్యక్రియలు జరిపే హక్కు ఉంటుందని, అలాగే మృతదేహాలను గౌరవప్రదంగా చూడాలని సుప్రీంకోర్టు చెప్పినా అక్కడి ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం కాలరాస్తూ దురుద్దేశపూర్వకంగా మృతదేహాలను అప్పగించడంలో తీవ్ర ఆలస్యం చేయడం అన్యాయమని, మానవత్వానికి మచ్చ అని అన్నారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 113 అర్జీలు

వినతులు స్వీకరించిన ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఆర్వో వైవీ గణేశ్


మడికొండ : వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హనుమకొండ, మే 26 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమం సాదా సీదాగా జరిగింది. కలెక్టర్ రాక కోసం ఎదురు చూసిన బాధితులు రాదని తెలువడంతో తమ సమస్యలపై ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఆర్వో వైవీ గణేశ్‌కు వినతి పత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై 113 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. హనుమకొండలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ కిడ్స్ ప్లే స్కూల్స్‌ను మూసివేయాలని స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లూరి సాయికుమార్, చెట్టుపల్లి శివకుమార్, సిద్ధు వినతి పత్రం అందించారు. అంబేద్కర్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పాత జీవో ప్రకారం అంబేద్కర్‌నగర్, జితేందర్‌నగర్ వాసులకు కేటాయించి న్యాయం చేయాలని కాలనీల వాసులు విజ్ఞప్తి చేశారు. ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భూమి కబ్జాకు గురైందని, ఆ భూమిని కాపాడాలని గ్రామస్తుడు ఎండీ ఖాజా మోయినొద్దీన్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో మేన శ్రీను, సీపీవో సత్యనారాయణరెడ్డి, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఎంహెచ్‌వో అప్పయ్య, జిల్లా సంక్షేమాధికారి జయంతి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును వేగంగా తరలించండి..

మడికొండ : మడికొండ శివారులో బల్దియా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు తరలింపును వేగవంతం చేయాలని కోరుతూ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో మడికొండ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డుతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరం నుంచి దాదాపు 450 టన్నుల చెత్తను ఇక్కడ డంపు చేస్తున్నారని దీంతో విష జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులతో నిత్య నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మద్దెల ఎర్రగట్టు స్వామి, పెండ్లి కృష్ణమూర్తి, గాండ్ల భిక్షపతి, బొల్లికొండ వినోద్, దువ్వ సాంబరాజు, కుదురు, బొల్లికొండ రాజు, సురేశ్, కొలిపాక కృష్ణ, మోడెం లావణ్య, పెద్ది సత్యనారాయణ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ ఆజాదీ ఫెడరేషన్ సభ్యులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

హనుమకొండ, మే 26 : రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించిన ప్రకారం స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో బీసీలకు 42 రిజర్వేషన్లు వర్తింపజేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. బీసీ పోరాటం, బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానంతో పాటు కులగణన చేసిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్, జనరల్ సెక్రటరీ ముధసూదన్‌రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కాజీపేటలో నేడు రైల్వే గ్రీవెన్స్

కాజీపేట, మే 26 : కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించే (డిజిటల్ లిటరసీ) గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రైల్వే పెన్షనర్లు విజయవంతం చేయాలని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంఘమయ్య కోరారు. ఈ గ్రీవెన్స్‌ను ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పెన్షనర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ జాతీయ నాయకుడు శ్రీధర్, రైల్వే సీనియర్ డీపీవో పాల్గొని ప్రత్యక్షంగా పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. రైల్వే రిటైర్డ్ పెన్షనర్లు, వారి కుటుంబాలు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ప్రారంభం

హనుమకొండ, మే 26 : భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సర్కారు లైసెన్స్‌డ్ సర్వేయర్లను భర్తీ చేయాలని నిర్ణయించి అర్హత ఉన్న నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 313 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు సర్వే ల్యాండ్ రికార్డు శాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. వీరికి హనస్‌పర్తిలోని టీడీసీలో ఈ నెల 26వ తేదీ నుంచి 50 రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం శిక్షణ ప్రక్రియ ప్రారంభించామన్నారు. అయితే దరఖాస్తు చేసుకొన్న 313 మందిలో వివిధ కారణాలతో 10 మంది దరఖాస్తులు తిరస్కరించగా, ఒక డబుల్ దరఖాస్తు వచ్చిందని, 17 మంది హాజరు కాలేదు. మిగిలిన 285 మంది శిక్షణలో పాల్గొన్నారు. మొదటి రోజు వీరందరి సర్టిఫికెట్లు పరిశీలించామన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం వేదిక మార్పు

హనుమకొండ, మే 26 : జిల్లాలో ఈ నెల 27వ తేదీ నుంచి 31 వరకు జిల్లాలో జరుగనున్న ఉన్నత పాఠశాలలకు చెందిన తెలుగు, హిందీ, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం ఉపాధ్యాయులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఉర్దూ మీడియంలో బోధించే భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం మార్చినట్లు డీఈవో వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల పెద్దపెండ్యాల వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో కాకుండా హనస్‌పర్తి మండలంలోని ఎర్రగట్టు గుట్ట గ్రీన్‌వుడ్ పాఠశాల (కిట్స్ కాలేజీ దగ్గర)లో శిక్షణ నిర్వహిస్తామన్నారు. శిక్షణ వేదిక మార్పు విషయాన్ని ప్రధానోపాధ్యాయులు గమనించి, తమ తమ ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. శిక్షణకు వచ్చే ఉపాధ్యాయులు కూడా ఈ విషయాన్ని గమనించి ఎర్రగట్టు గుట్ట వద్ద గల గ్రీన్‌వుడ్ పాఠశాలలో శిక్షణకు హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి

కలెక్టరేట్ ఎదుట పంథిని గ్రామ దళితుల ధర్నా

హనుమకొండ, మే 26 : జిల్లాలోని ఐనవోలు మండలం పంథిని గ్రామం పరిధిలో ఖమ్మం హైవే రోడ్డు పక్కన దళితులకు చెందిన సీలింగ్ భూమిని ఆక్రమించి పట్టా చేసుకున్న కరిమిల్ల విక్రమ్‌రావుపై చర్యలు తీసుకొని పట్టా రద్దు చేయాలని ఆ గ్రామ దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌వో వైవీ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. పంథిని గ్రామ పరిధిలో ఆరుగురు దళితులకు మనిషికి నాలుగు, ఐదు గుంటల చొప్పున 322 సర్వే నంబర్ పక్కనున్న అసైన్డ్ భూమి ఉందని, దానిలో 15 సంవత్సరాల నుంచి తాము సేద్యం చేయడం లేదని ధరణి వచ్చిన తర్వాత విక్రమ్‌రావు అధికారులను ప్రలోభాలకు గురిచేసి పట్టా చేయించుకున్నాడన్నారు. అతడిపై తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశామని, అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేసి ఎలాంటి చర్యలు తీసుకోలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టర్ తక్షణమే స్పందించి భూమిని సర్వే చేయించి విక్రమ్‌రావు చేసుకున్న పట్టాను రద్దు చేసి, తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలన్నారు. అఖిల్, రాజశేఖర్, ఎన్ రాజకుమార్, ప్రసాద్, యశ్వంత్, పూలమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

పోలీసులకు న్యాయవాది నాగరాజు శిక్షణ

వరంగల్ లీగల్, మే 26 : బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులకు హైదరాబాదులోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ సెంటర్లో వరంగల్ న్యాయవాది వల్లాల నాగరాజు వివిధ చట్టాలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎంపిక చేసిన పోలీసు ఉన్నతాధికారుల శిక్షణ కార్యక్రమంలో సివిల్ తగాదాల్లో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై న్యాయవాది వారికి అవగాహన కల్పించారు. ప్రతిష్టాత్మకమైన కేంద్ర శిక్షణ సంస్థలో పోలీసు ఉన్నతాధికారులకు శిక్షణ ఇచ్చే అవకాశం వరంగల్ న్యాయవాది వల్లాల నాగరాజుకు దక్కడంపై ఇక్కడి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే వొక్సోన్ యూనివర్సిటీలో, ఆదర్శ న్యాయ కళాశాలలో విజిటింగ్ ఫ్యాకల్టీగా సేవలందిస్తూ ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఇండియన్ పోలీస్ ఫౌండేషన్‌లో, చెన్నై కేంద్రంగా పనిచేసే ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిమినాలజీలో కూడా గౌరవ సభ్యుడిగా నాగరాజు కొనసాగుతున్నారు.

ఎప్పటి నుంచో అక్కడ నాలా, బ్రిడ్జి ఉంది

ఇరిగేషన్ ఈఈ శంకర్‌నాయక్

హనుమకొండ, మే 26 : జిల్లాలోని పంథిని గ్రామ సర్వే నంబర్ 322, 323లో నాలా ఉందని, చాలా సంవత్సరాల క్రితమే అక్కడ వరంగల్, ఖమ్మం జాతీయ రహదారి, దానిపై బ్రిడ్జి నిర్మించారని ఇరిగేషన్ ఈఈ శంకర్ నాయక్ 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన వార్తకు వివరణ ఇచ్చారు. కుడా వరంగల్ ఉపాధ్యక్షుడు 2023 ఆగస్టు 8వ తేదీన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 323/B/1, 323/B/2లో 7,418.88 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మెరుగు మరుధ్వతి భర్త రమేశ్‌కు చెందిన భూమికి నాలా అలైన్‌మెంట్ ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) జారీ చేయాలని ఇరిగేషన్ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చారు. ఈ భూమి నాలాకు దగ్గరగా ఉందని, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ధ్రువీకరించి, నాలా ప్లాన్‌ను త్వరితగతిన సిద్ధం చేయాలని అభ్యర్థించారని తెలిపారు. ఈ విషయంలో కుడా ఉపాధ్యక్షుడికి ఇరిగేషన్ కార్యాలయం నుంచి పంథిని గ్రామంలోని స్థలం నాలాకు (స్ట్రీమ్) సమీపంలో ఉందని, అర్జీదారుడి భూమిలో కొంత భాగం స్ట్రీమ్ హై ఫ్లడ్ లెవల్ (హెచ్ఎఫ్ఎల్) ప్రాంతంలో, కొంత భాగం స్ట్రీమ్ బఫర్ జోన్‌లో ఉందని 2023 సెప్టెంబర్ 25న నివేదించినట్లు తెలిపారు. స్ట్రీమ్‌లో 1,532 చదరపు మీటర్లు, బఫర్ జోన్‌లో 1,490 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉందని, మిగిలిన 4,397.88 భూమి నిర్మాణానికి ఉపయోగపడుతుందని తెలిపినట్లు వివరించారు. రెగ్యులరైజేషన్‌కు ముందు సర్వే నంబర్లు, గ్రామ మ్యాపులోని నాలాలను ధ్రువీకరించాలని సూచించినట్లు చెప్పారు. కుడా ఉపాధ్యక్షుడి కోరిక మేరకు 2023 సెప్టెంబర్ 25న మరుధ్వతి పేరున ఎన్‌వోసీ జారీ చేశామన్నారు. గ్రామ సర్వే మ్యాప్‌ను పరిశీలించినప్పుడు పంథిని గ్రామంలో సర్వే నంబర్ 322, 323కు ముందు, తర్వాత నాలా (స్ట్రీమ్) ఉందని స్పష్టమైందన్నారు. ఇక్కడ వరంగల్ నుంచి ఖమ్మం జాతీయ రహదారి ఉందని, చాలా సంవత్సరాల క్రితం దీనిపై బ్రిడ్జి నిర్మించారన్నారు. హనుమకొండ సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ లెటర్ నంబర్ A5/165/2025 తేదీ 6.5.2025 ద్వారా పంథిని గ్రామ మ్యాప్‌లో సర్వే నెంబర్ 322, 323లో వాగు లేదని, కానీ సర్వే నంబర్ 322,323 డీ మార్కేషన్ తరువాత వాగు సర్వే నంబర్ 323లో మాత్రమే ఉందని తెలిసిందని తెలిపారు. ఈ విషయంలో హనుమకొండ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ స్పష్టంగా తెలిపారన్నారు. 25 సంవత్సరాల్లో గూగుల్ మ్యాప్ ప్రకారం వాగు అలైన్‌మెంట్/కోర్సులో ఎలాంటి మార్పు లేదని, ఇరిగేషన్ కార్యాలయ భవన అనుమతులు జారీ చేసేందుకు అధికారం లేదని, కేవలం నాలా, బఫర్ జోన్‌లను గుర్తించి ఎన్‌వోసీ జారీ చేసేందుకు మాత్రమే అధికారం ఉందన్నారు. ఈ శాఖ ఆదేశానుసారం సాగునీటి ప్రయోజనాలకు సంబంధించి ఎన్‌వోసీ జారీ చేయడం, సహజ నాలాలు, నీట వనరుల ఉనికి, అలైన్‌మెంట్, బఫర్ జోన్‌లను ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం గుర్తించడానికే పరిమితం అని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, కుడా అధికారులకు సమాచారం అందిస్తున్నట్లు ఈఈ చెప్పారు.

నాలా సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా..

- ప్రతి డివిజన్‌లో దశల వారీగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

న్యూశాయంపేట : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని

కాజీపేట/న్యూశాయంపేట, మే 26 : సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి రైల్వే ప్రాంతంలోని నాలా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వర్షాకాలంలో 47వ డివిజన్ పరిధిలోని బాపూజీనగర్, బూడిదగడ్డ తదితర ప్రాంతాల నుంచి భారీ వర్షాల వల్ల రైల్వే ఏరియాలోని డ్రైనేజీలు నిండిపోయి మురుగు నీరు ముంచెత్తుతున్న ఇళ్లను ఆయన సోమవారం రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. నీరు నిల్వకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన పలు అంశాల గురించి అధికారులకు సూచించారు. నాలాలోని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను వీలైనంత త్వరగా తొలగించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటితో ఈ ప్రాంత వాసుల ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైల్వే జీఎం, డీఆర్ఎంలు, జిల్లా అధికార యంత్రాంగంతో చర్చించి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తానన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే నాయిని అన్నారు. 49వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ కడియం కావ్య, కార్పొరేటర్ ఏనుగుల మానస-రాంప్రసాద్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు.

క్రీడాకారులకు అభినందన..

హనుమకొండ : ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు మెదక్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 43వ జాతీయ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు సాఫ్ట్‌బాల జిల్లా కార్యదర్శి రాజేందర్ తెలిపారు. బాలుర విభాగంలో వీ పవన్ కుమార్, ఎం జగదీశ్, బాలికల విభాగంలో ఎ స్ఫూర్తి ఈ నెల 29 నుంచి జూన్ 2వ తేదీ వరకు చండీగఢ్‌లో జరిగే నేషనల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు పీ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు పీ సాంబ మూర్తి, కోచ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

వర్షాకాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మే 26 : రానున్న వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో వరద ముప్పు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లు తెగిపోయే ప్రాంతాలను ఆ శాఖ అధికారులు ముందస్తుగానే గుర్తించాలన్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో వర్షపు నీరు కారణంగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారే ప్రాంతాలను గుర్తించాలన్నారు. చెరువులు, వాగుల స్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. వాగులు పారే ప్రాంతాలను సంబంధిత తహసీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. చెరువుల కట్టలు బలోపేతం చేయాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు విపత్తు నిర్వహణ సంబంధించిన ఉపకరణాలను సిద్ధంగా ఉంచాలని, బోట్స్, లైఫ్ జాకెట్స్, ది వాటరింగ్ పంపు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. శిథిలావస్థకు చేరిన పాత భవనాలను అధికారులు గుర్తించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సరిపోను మందులు ఉంచాలని, వ్యాధులు ప్రబలే అవకాశాలున్న చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో కలెక్టరేట్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ సలీమా, ఇన్‌చార్జి కలెక్టర్ గణేశ్, మేన శ్రీను, సీపీవో సత్యనారాయణరెడ్డి, డీఏవో రవీందర్‌సింగ్, డీపీవో లక్ష్మీరమా కాంత్, డీఎంహెచ్‌వో అప్పయ్య, ఆర్డీవో నారాయణ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్ష ఫిర్యాదుకు వాట్సాప్ నంబర్ ఆవిష్కరణ..

లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు వాట్సాప్ నంబర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. పుట్టబోయే బిడ్డ ఆడ మగ అని చెప్పడం, తెలుసుకోవడం చట్టరీత్యా నిషేధమన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘించి ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలుసుకొని అబార్షన్లకు పాల్పడినా 6300030940 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అలాగే 104,181,1098, డయల్ 100 లేదా pndtmtp complaintsdmhohnk@gmailలో ఫిర్యాదు చేయొచ్చన్నారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి